జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 1-09-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 116 పేజీలు: 8 వెల : రూ.7



* కళింగపట్నంలో తీరం దాటే అవకాశం * జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో వర్షం * తీరంలో అలజడి * ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు * కళింగపట్నం పోర్టు వద్ద మూడో ప్రమాద హెచ్చరిక * కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ * తుఫాను ప్రభావిత మండలాలకు ప్రత్యేక అధికారులు * ప్రజలు ఇళ్లలోనే ఉండాలి * మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు * అధికారులు అప్రమత్తంగా ఉండండి * కంట్రోల్ రూమ్‌కు 08942-240557 ఫోన్ చేయండి

* మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు

# రెడ్ అలర్ట్

**శ్రీకాకుళం, ఆగస్టు 31(వార్త):** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి కళింగపట్నం వద్ద తీరం దాటనుందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. తీరంలో సముద్ర కెరటాలు ఉధృతంగా ఎగసిపడుతున్నాయి. కళింగపట్నం పోర్టు వద్ద మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తుఫాను ప్రభావిత మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ముందస్తు చర్యలలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి శనివారం కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తో కలసి సంబంధిత అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని, తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోవ డానికి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ని ఏర్పాటు చేశామని, తుఫాను, ఇతర భారీ నష్టాలకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే కంట్రోల్ రూమ్ నెం:08942-240557 కు ఫోన్ చేయాలన్నారు. 08942-240557 నెంబర్ కు అత్యవసర సమయంలో ఫోన్ చేయాలన్నారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాలకు తుఫాను పర్యవేక్షక అధికారులను నియమించారు. జిల్లాలోని 30 మండలాలలో తహశీల్దార్‌లను వారి వారి మండలాల్లో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేశారు.

**అప్రమత్తంగా ఉండండి: మంత్రి అచ్చెన్న**

తుఫాన్ తీరం దాటే సమయంలో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవ కాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ప్రజల్లో ఇళ్లలోనే ఉండాలని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు.



## ఊరూరా పింఛన్ల పండగ

* ఉదయం నుంచే సామాజిక పింఛన్లు పంపిణీ
* పింఛన్ల పంపిణీలో స్టేట్‌లో సిక్కోలు ఫస్ట్
* మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల పర్యవేక్షణ *పింఛన్ల పంపిణీ ప్రభుత్వ బాధ్యత * రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

## జీడిపప్పు అక్రమ రవాణా

* కోసంగిపురం జంక్షన్ కేంద్రంగా..
* ప్రైవేట్ వాహనాల్లో పప్పు తరలింపు..
* పన్ను ఎగవేతకు కొత్త పద్ధతి
* అధికారులకు నెలవారీ మామూళ్లు
* కన్నెత్తి చూడనం సంబంధిత అధికారులు

## ఒడిశా రశీదులు.. ఆంధ్రాలో తరలింపులు

* ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట * అనుమతి లేకుండా ఆకులతంపరలో ర్యాంపు * ఎమ్మెల్యే అనుచరుల హస్తముందంటూ ఆరోపణలు

లోపల పేజీల్లో



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే గొండు



**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు31(వార్త):** బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నా యని, మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవ కాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా నియోజకవర్గంలోని ప్రజలు శిథిలమైన, పాత ఇండ్లలో ఉండవద్దని సూచించారు. వర్షాల కారణంగా గోడలు, శ్లాబులు కూలి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. అదే విధంగా చెరువుల్లో, వాగుల్లో, కాలువల్లో నీరు అధికంగా చేరడంతో స్నానాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చిన్నారులను నీటి ప్రవాహాల వద్దకు తీసుకు వెళ్లవద్దని తెలిపారు.

# ఊరూరా పింఛన్ల పండగ

* ఉదయం నుంచే సామాజిక పింఛన్లు పంపిణీ * పింఛన్ల పంపిణీలో స్టేట్‌లో సిక్కోలు ఫస్ట్
* మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల పర్యవేక్షణ *పింఛన్ల పంపిణీ ప్రభుత్వ బాధ్యత * రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు





**శ్రీకాకుళం, ఆగస్టు31(వార్త):** జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ పండగ వాతావరణంలో సాగింది. శనివారం ఉదయం నుంచి గ్రామసచివాలయ సిబ్బందితో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. జోరువానలోనూ ఈ పింఛన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగింది. పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలోనే సిక్కోలు జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని జిల్లా అధికారులు వెల్లడించారు. టెక్కలి మండలం రావివలసలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భద్రత ఫించన్లు పంపిణీ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉందని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి 90 రోజులు అవుతుందని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఒక్కొక్క హామీని అమలు చేస్తున్నామని చెప్పారు. 1వ తేదీన ఆదివారం వచ్చినందు వల్ల అధికారులకు ఇబ్బంది లేకుండా ముందురోజే ఫించన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాలంటీర్లు లేకపోయినా గ్రామసచివాలయ సిబ్బంది ద్వారా రెండు రోజుల్లోనే ఈ పింఛన్ల ప్రక్రియ పూర్తి చేస్తున్నామన్నారు. టెక్కలి నుండి రావివలసకు వచ్చే రహదారికి త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. ఎండలమల్లిఖార్జున స్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. సెప్టెంబర్‌లో నీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయని, గొడవలు పడకుండా రైతులంతా సమన్వయంతో కాలువ బాగు చేసుకోవాలన్నారు. మూలపేట నుండి విశాఖపట్నం వరకు తీర ప్రాంతం అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అన్న కేంటీన్ లు కోటబొమ్మాళి, టెక్కలిలో తన స్వంత నిధులతో ప్రారంభించినట్లు చెప్పారు. ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకాలు జారీ చేస్తామన్నారు. నిర్మించిన గృహాలకు సంబంధించి బిల్లులు అవ్వకపోతే అప్ లోడ్ చేయాలని చెప్పారు. రూ. 77.30 లక్షలుతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయ భవనాలను ఆయన ప్రారంభించారు. గ్రామ సచివాలయ భవనం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. మాజీ జడ్పీటీసీ కెఎల్ నాయుడు మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లు, గృహాలు లేనివారికి గృహాలు, తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసువచ్చారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో సుదర్శన్ దొర, ఇన్ చార్జ్ డిపిఓ ఆర్. వెంకట్ రామన్, తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి, టెక్కలి ఎంపిపి ఎ. సరోజనమ్మ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, మాజీ ఎంపీపీ సుందరమ్మ, పశు సంవర్ధక శాఖ జెడి జయరాజు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### సస్పెండ్ చేయండి

పెన్షన్లు పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రి టెక్కలి మండలం రావివలస వెళుతుండగా టెక్కలి ప్రధాన రహదారి పక్కనే పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడాన్ని చూసి సంబంధిత అధికారులపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారిని సస్పెండ్ చేయాలని ఈవోను ఆదేశించారు.



పేషెంట్లకు మౌలిక

## సదుపాయాలు కల్పించండి

* ఆసుపత్రిలో లిఫ్ట్ అందుబాటులోకి తీసుకురావాలి * రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**టెక్కలి, ఆగస్టు31(వార్త):** టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రిలో వీల్ ఛైర్స్, లిఫ్ట్ తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. శనివారం జిల్లా ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు.గతంలో తాను ప్రారంభించిన శిలాఫలకాలు తొలగించారని, తక్షణమే ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో రోగులుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులకు అడిగి తెలుసుకున్నారు. ఓపి విభాగం విభాగానికి వెళ్లి రోజుకి ఎంతమంది రోగులు వస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుర్చీలు, తాగునీరు, తక్షణమే సమకూర్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. వైద్యులు అందుబాటులో ఉండాలని, బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులకు అండగా

## కూటమి ప్రభుత్వం



**శ్రీకాకుళం, ఆగస్టు 31(వార్త):** సంచార జాతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. సంచారజాతులు విముక్త దివస్‌ను పార్టీ ఓబీసీ మోర్చా సంచారజాతులు విభాగం రాష్ట్ర కో కన్వీనర్ పి.సురేష్ బాబు సింగ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న మున్సిపల్ మైదానంలో నిర్వహించారు. 30 సంచార జాతుల కుటుంబాలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. శ్రీకాకుళం సంచారజాతులు కుల పెద్ద పూసల కుమారిష దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు సింగ్ మాట్లాడుతూ సంచార జాతుల చరిత్ర చాలా గొప్పదన్నారు. వీరి పూర్వీకులు గొప్ప యోధులుగా పేరుగాంచారన్నారు. ప్రస్తుతం వీరు కుటుంబ పోషణ నిమిత్తం సంచారం చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సొంత ప్రాంతమనేది లేకుండా వలస పక్షులు మాదిరిగా వీరి జీవనం తయారైందన్నారు. వీరి ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు 2015లోనే ఒక కమిషన్ ఏర్పాటైందన్నారు. సంచార జాతులకు హెల్త్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో పాటు పలు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులు పి.సూర్య కుమారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.సంజీవరావు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా భవన నిర్మాణ కార్మికులు సెల్ కన్వీనర్ జి.రాజు , జిల్లా సంచారజాతులు విభాగం కార్య వర్గ సభ్యులు పట్నాయక్, బీజేపీ నాయకులు వెంకటరావు, రమణ పాల్గొన్నారు.

### 3న జాబ్‌మేళా

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 31(వార్త):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల3న శ్రీకా కుళం నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు శీకాకుళం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి.సాయి శ్రీనివాస్ తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువత అర్హులన్నారు. ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి మేళా ఉంటుందని, తొమ్మి బహుళజాతి కంపెనీలు పాల్గొని ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తారన్నారు. దివ్యాంగులు సైతం హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9550967353, 8317652552 నెంబర్లను సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం skilluniverse.apssdc.in వెబ్ సైట్ ను సందర్శించి రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

# తోటాడవాసికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ఆమదాలవలస, ఆగస్టు31(వార్త):** తోటాడ గ్రామానికి చెందిన కలివరపు రామకృష్ణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయమై గ్రామస్థులతో పాటు కుటుంబీకులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు సమాచారం అందించారు. రామకృష్ణకు శస్త్ర చికిత్స నిమిత్తం రూ.15లక్షలు మంజూరైంది. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన 15లక్షలు విలువైన చెక్కును శుక్రవారం ఆమదాలవలసలో జరిగిన వనమహోత్సవంలో రామకృష్ణకు ఎమ్మెల్యే కూన రవికుమార్ అందజేశారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, హనుమంతు బాలకృష్ణ, కూన అమ్మాజీ, తాండ్ర హరి, బి.సీతారాం, బెండి రాము, తోటాడ, అక్కివరం పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా పవన్ పుట్టినరోజు వారోత్సవాలు



**బూర్జ, ఆగస్టు 31 (వార్త):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు ను బూర్జ మండల నాయ కులు శనివారం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ బూర్జ మండల అధ్య క్షుడు కొత్తకోట నాగేంద్ర ఆధ్వర్యంలో బురిడి క్రాంతి కుమార్ పర్యవేక్షణలో శని వారం తోటవాడ గ్రామంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నియో జకవర్గం ఇన్చార్జ్ పేడాడ రామ్మోహనరావు సందర్శించి కొత్తకోట నాగేంద్ర ను అభినందించారు. వర్షాల కారణంగా గ్రామాల్లో దోమల బెడదతో అధికంగా విషజ్వరాల బారిన పడ్డ గ్రామస్థులకు ఈ వైద్య శిబిరం ఎంతో మేలు చేస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం, టిడిపి, బీజేపీ పార్టీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## 'ఆదిత్య'లో ఎయిడ్స్‌పై అవగాహన



**మందస, ఆగస్టు 31 (వార్త):** బాలిగాంలో గల ఆదిత్య కళాశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఎయిడ్స్ ఏ విధంగా అరికట్టాలి.. ఇది అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. సామాజిక బాధ్యత, అవగాహన ఉండాలన్నారు. మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని అపోహలు తొలగించుకోవాలని, సురక్షిత పద్ధతులు ద్వారా దీన్ని అరికట్ట వచ్చని విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రోగ్రాం హెడ్ మాధవ రావు, ప్రోగ్రాం మేనేజర్ ప్రసాదరావు హాజరు కాగా, కళాశాల ప్రిన్సిపాల్స్ బొంగి ప్రవీణ్, మార్పు హరికృష్ణప్రసాద్, అధ్యాపక బృందం, ఎన్.ఎస్.ఎస్. ప్రొగ్రాం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా రాంబాబు

**ఇచ్చాపురం, ఆగస్టు 31(వార్త):**గత కొన్ని నెలలుగా వివాదంగా మారి వాయిదా పడుతూ వస్తున్న మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అంశం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎం.రాంబాబును ఎన్నుకున్నారు. అతనిని ఎంఎస్‌సిగా నియమించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షత న శనివారం కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఐదుగురు న్యాయవాదులు దరఖాస్తు చేసుకోగా ఒకటవ వార్డు కౌన్సిలర్ సుగ్గ ప్రేమ్ కుమార్.. రాంబాబు పేరును ప్రతిపాదించారు. 11వ వార్డు తెలుగుదేశం కౌన్సిలర్ ఆశీ లీలా రాణీ.. నాగరాజు పాత్రో పేరును ప్రతిపాదించారు. మెజార్టీ సభ్యులు రాంబాబు పేరు చెప్పడంతో అతన్నే ఎన్నుకున్నారు. రాంబాబు ఎం.తోటురులో యువసూర్య ట్రస్ట్ పేరుతో చేస్తున్న సేవా కార్యక్రమాలకు కౌన్సిలర్లు అభినందించారు.



## మిజోరాం గవర్నర్‌ను కలిసిన గౌతు శిరీష

**పలాస, ఆగస్టు 31(వార్త):** మిజోరం గవర్నర్ కంభంపాటి హరి బాబుని పలాస శాసనసభ్యులు గౌతు శిరీష భర్త వెంకన్న చౌదరితో విశాఖ పట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరిబాబు గౌతు లచ్చన్నతో ఉన్న సత్సంబంధాలను గుర్తు చేసుకున్నారు.

## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**పలాస, ఆగస్టు 31(వార్త):** కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాల విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్ యు)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాలు ఏర్పాటు తీవ్ర ఆందోళన గురి చేసిందని, దేశంలో విద్యార్థినిలకు, మహిళలకు రక్షణ కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియోలు రికార్డు చేయబడ్డాయని అనుమానాలను కూడా ఆ కళాశాల విద్యార్థులు విద్యార్థినిలు లేవనెత్తారని వీటి పై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినీలను, స్త్రీలను వ్యాపార వస్తువుగా మార్చుతున్న విష సంస్కృతికి మూలాలైనా అశ్లీల చిత్రాలు, సాహిత్యం, సినిమాలు,డ్రగ్స్ వంటి వాటిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని విద్యార్థినిలకు రక్షణ కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేస్తుందన్నారు.

## కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో రహస్యంగా కెమెరాలు పెట్టిన దుర్మార్గమైన చర్యలో పాల్గొన్న నిందితుల్ని కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యంపై తక్షణమే చర్యలను తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీ ఓ డబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ డిమాండ్ చేసారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలోని పిఓడబ్ల్యూ కార్యాలయంలో సంఘం జిల్లా నాయకులు కుత్తుం హేమక్క, బర్ల జానకమ్మలతో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కళాశాల వసతి గృహంలో రహస్యంగా హిడెన్ కెమెరాలను అమర్చి అసభ్యకరంగా వ్యవహరించిన ఘటన అత్యంత దుర్మార్గమన్నారు. నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుంటున్న యాజమాన్యం వసతి గృహాల్లో సరైన పర్యవేక్షణ చేయడం లేదన్నారు. ముందస్తు సమాచారం వున్నా కూడా యాజమాన్యం స్పందించలేదన్నారు. యజమాన్యం పై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసారు.కోల్ కత్త ఘటన మరువకముందే మన రాష్ట్రంలో ఇటువంటి దారుణమైన ఘటన జరగడం అమానుషమన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విచారణకి ఆదేశించిన నేపథ్యంలో నిజానిజాల్ని వెలుగులోకి తీసుకురావాలని కోరారు. విద్యార్థినుల జీవితాలతో చెలగాటమాడుతున్న నిందితుల్ని కఠినంగా శిక్షించాలని, కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## వయ్యారిభామతో జీవ వైవిధ్యానికి తీవ్ర నష్టం

**పలాస, ఆగస్టు 31(వార్త):**ఎన్ని సార్లు పీకినా మళ్లీ మళ్లీ పెరిగి, వదలని వయ్యారిభామ కలుపు మొక్కలు వలన స్థానిక మొక్కల వైవిధ్యానికి తీవ్ర నష్టం జరుగుతుందని బ్రాహ్మణతర్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి. రమణరావు అన్నారు. శనివారం వయ్యారిభామ అవగాహన వారోత్సవాలు సందర్భంగా హైస్కూల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని జాతీయ హరిత దళం క్లబ్, జూనియర్ రెడ్ క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు వయ్యారి భామ-వదలదు మామ అనే నినాదంతో పాఠశాల ఆవరణలో పెరిగిన వయ్యారి భామ కలుపు మొక్కలను పీకి, కాల్చివేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# కౌన్సిల్ సమావేశంలో..
# గర్జించిన వైస్ చైర్పర్సన్లు

* 16వ వార్డు రోడ్లు శంకుస్థాపన వాయిదాపై ధ్వజమెత్తిన భారతీదివ్య * అధికారుల పనితీరుపై కడిగిపారేసిన స్వర్ణమణి * కమిషనర్ తీరును ఎండగట్టిన ఇద్దరు వైస్ చైర్పర్సన్లు * ఒకానొక దశలో చైర్ పర్సన్ తీరుపై కూడా ఆగ్రహం



**ఇచ్చాపురం, ఆగస్టు 31 (వార్త):** మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశం వాడి వేడిగా సాగింది. వైస్ చైర్పర్సన్లు లాభాల స్వర్ణమణి, ఉలాల భారతి దివ్య లు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. కమిషనర్ ఎన్ రమేష్ వ్యవహార శైలిపై గట్టిగా నిలదీశారు. ఒకానొక దశలో చైర్పర్సన్ రాజ్యలక్ష్మి పై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పకీర్ పేట రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని ఆహ్వానం పలకడంతో భారతి దివ్య ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో వార్డులో ఒక వ్యక్తికి సమాచారం లేదన్న సాకుతో శంకుస్థాపన వాయిదా వేసిన అంశాన్ని తనకు ముందుగా తెలియజేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి కోసం మూడేళ్లుగా నిలిచిపోయిన రోడ్డు పనులు ఆపేయడం ఏంటని నిలదీశారు. జండా పట్టిన కార్యకర్తకు ఎమ్మెల్యే అశోక్ ఇచ్చిన విలువ ఇతర పార్టీ నాయకులు ఇవ్వడం లేదని పరోక్షంగా చైర్పర్సన్ తీరుపై మాట తూలడంతో 'మైండ్ యువర్ లాంగ్వేజ్' లిఅంటూ చైర్పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే తరహాలో భారతి దివ్య కూడా ఇదే పదజాలంతో ఢీ కొట్టారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇక మున్సిపాలిటీలో టాయిలెట్లు మరమ్మతుకు రూ.11.5 లక్షలు కేటాయించడంపై ఇరువురి చైర్ పర్సన్లతోపాటు తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ బచ్చు జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. టాయిలెట్లు మరమ్మతుకు ఎన్ని నిధులు ఖర్చు అవుతాయని ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్‌ని నిలదీశారు. నాన్ ప్లాన్ గ్రాంట్ నిధులు మిగిలి ఉన్నట్లు కౌన్సిలర్లకు కనీసం సమాచారం ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. మున్సిపల్ ఆఫీసులకు మరో రెండు గేట్లు ఏర్పాటు చేసి రోడ్డు వేయడానికి మరో 14.50 లక్షల రూపాయలతో నిధులు కేటాయించడంపై కూడా నిలదీశారు. దీంతో ఈ రెండు అంశాలను చైర్ పర్సన్ వాయిదా వేశారు. గాంధీ పార్కులో పనులు పూర్తి చేయాలని 14వ కౌన్సిలర్ నీలాపు లక్ష్మి కోరారు. కోతులు పట్టుకునేందుకు అటవీ శాఖ అనుమతి తీసుకోవడంపై ప్రయత్నాలు చేయాలని 11వ వార్డ్ కౌన్సిలర్ ఆసి లీలా రాణీ కోరారు. కాలువలపై కవర్ స్లాబ్, పూడిక తీత పనులు పాత తేదీలతో చేసి కొత్త తేదీలతో టెండర్ ఆమోదానికి వైస్ చైర్ పర్సన్‌లు స్వర్ణ మణి, ఉలాల భారతి దివ్య లు డీసెంట్ ఇచ్చారు. కౌన్సిలర్లకు సమాచారం లేకుండా అవసరం లేని చోట పనులు ఎందుకు ముందుగా చేస్తున్నారని ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ పై మండిపడ్డారు. మాస్టర్ ప్లాన్ ను కౌన్సిలర్లు ముందు ఉంచకుండానే ఆమోదం కోరడంపై టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సూరనారాయణను స్వర్ణమణి నిలదీశారు. ఈ అంశంపై కూడా డీసెంట్ ఇవ్వడంతో వాయిదా వేశారు. మున్సిపాలిటీలో కుక్కలు బెడద ఎక్కువగా ఉండడంతో కుక్కల్ని పట్టుకునేందుకు పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. సుగ్గ ప్రేమ్ కుమార్, బచ్చు జగన్, ఆసి లీలా రాణీ, ప్రదీప్ కుమార్, తవిటయ్యలతో కుక్కల పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఆవుల సంచారంపై కూడా చర్యలు తీసుకోవాలని వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య కోరారు. స్మశాన వాటిక అభివృద్ధి చేసి కాటి కాపరిని ఏర్పాటు చేయాలని కోరారు. అన్న క్యాంటీన్ పనులు ఐదు లక్షల రూపాయల పనిని నామినేషన్ పద్ధతిలో కేటాయించడం మున్సిపల్ చట్ట విరుద్ధమని స్వర్ణమణి అభ్యంతరం వ్యక్తం చేశారు. అన్న క్యాంటీన్ లకు తాను వ్యతిరేకం కాదని నిబంధనలకు లోబడి విధుల వినియోగం జరగాలని కోరారు. సమావేశంలో సభ్యులతో పాటు అధికారులు పాల్గొన్నారు.





## బొడ్డపాడులో పింఛన్లు పంపిణీ

**పలాస, ఆగస్టు 31 (వార్త):** తెలుగుదేశం మండల యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీ రావు ఆధ్వర్యంలో శనివారం పలాసలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగంలో..

**జలుమూరు:** శ్రీముఖలింగంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ వెంకట్రావు, సర్పంచ్ టి.సతీష్, మాజీ సర్పంచ్ తర్ర బలరాం, గ్రామ టీడీపీ నాయకులు దేవ మాస్టారు, మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## అచ్యుతాపురం పీహెచ్‌సీ తనిఖీ

**జలుమూరు, ఆగస్టు31 (వార్త):**అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సందర్శించారు. ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టిక తనిఖీ చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రబలుతున్న వ్యాధుల పట్ల ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకి అన్నివేళలా అందుబాటులో ఉండాలని మెడికల్ ఆఫీసర్, సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్ర నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెలమల చంద్ర భూషణ్, మునికోటి దాంబాబు, సర్పంచ్లు బగ్గు గోవిందరావు, పెంచిరెడ్డి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకంలో అలసత్వం వద్దు

**నరసన్నపేట, ఆగస్టు 31 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పథకంలో ఎటువంటి అలసత్వం వహించ కూడదని ఎంఈఓలు పేడాడ దాలి నాయుడు, ఉప్పాడ శాంతారావు ఆదేశించారు. శనివారం నరసన్నపేట మండలం దూకులపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించారు.

## చినదూగంలో వైద్య శిబిరం

**జలుమూరు, ఆగస్టు31 (వార్త):**జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చల్ల వంశీ కృష్ణ ఆధ్వర్యంలో చినదూగం గ్రామంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యలు లో భాగంగా సీజనల్ వ్యాధులు మలేరియా డెంగీ వ్యాధులు ప్రబలకుండా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పీసా పద్మావతి, ఏఎన్ఎం సత్యవతి, ఎంఐహెచ్‌పీ సాయి, హెల్త్ అసిస్టెంట్ చిన్నారావు, వెంకటరావు, ఆశా కార్యకర్తలు శుభ, జగదాంబ పాల్గొన్నారు.



## లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోండి

**నరసన్నపేట, ఆగస్టు 31 (వార్త):** సెప్టెంబరు 14న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని నరసన్నపేట సివిల్ జడ్జి చందక హరిప్రియ సూచించారు. నరసన్నపేట కోర్టులో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. స్థానిక కక్షిదారులకు ఇదో సువర్ణవ కాశమని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కేసులు ఇప్పుడు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. రాజీ దగ్గ క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంకు కేసులను లోక్ అదాలత్లో పరిష్కారం చేసుకోవాలన్నారు.



# ఒడిశా రశీదులు.. ఆంధ్రాలో తరలింపులు

* ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట
* అనుమతి లేకుండా ఆకులతంపరలో ర్యాంపు
* ఎమ్మెల్యే అనుచరుల హస్తముందంటూ ఆరోపణలు





**శ్రీకాకుళం, ఆగస్టు 31 (వార్త):** కొత్తూరు మండలం ఆకులతంపర గ్రామంలోని ఇసుక ర్యాంప్ ను కొందరు అనధికారికంగా ఏర్పాటు చేసి ఇసుకను తవ్వేస్తూ తరలించేస్తున్నారు. ఒడిశా రశీదులు చూపిస్తూ కొందరు ఇసుకాసురులు ఆకులతంపరలో ఇసుకను గుట్టుగా లారీలతో తరలిస్తూ కాసులు చేసు కుంటున్నారు. గత కొద్ది రోజుల క్రితం అంగూరు ఇసుక ర్యాంపులో ఇసుక లేనందున ర్యాంప్ మూసి వేశారు. ఈ క్రమంలో ఓ ఎమ్మెల్యే అండదండలతో ఆకులతంపర నుండి గత 3 రోజులుగా రోజుకి సుమారు 30 నుండి 40 లారీలతో ఇసుకను అక్ర మంగా తరలిస్తున్నారు. ఇలా ఇసుకను తరలించే క్రమంలో శుక్రవారం రాత్రి ఆర్‌కేపురం గ్రామస్థులతో పాటు చుట్టూ ప్రక్కన ఉండే గ్రామస్థులు రోడ్లు పాడై పోతున్నాయని లారీలను ఆపివేశారు. అర్ధరాత్రి 1 గంటకి స్థానికులు స్థానిక పోలీస్ స్టేషన్ కొత్తూరు ఎస్ఐకు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని చూసి మరల తిరిగి వెనుకకు వెళ్లిపోయారు. శనివారం ఉదయం టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్య క్షుడు కలమట వెంకటరమణకు ఆయా గ్రామస్థులు సమాచారం అందజేశారు. హుటాహుటిన కలమట వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకొని అక్ర మంగా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను అడ్డు కున్నారు. ఇసుక ఎక్కడి నుంచి తరలిస్తున్నారన్న దాని పై రశీదులు పరిశీలించారు. వీరు ఒడిశా నుంచి ఇసుక తరలిస్తున్నట్టు రశీదులు చూపించడంతో కల మట అవాక్కయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంట లకు 4 లారీలను పట్టుకున్నా శనివారం ఉదయం 8 గంటలు అయిన ఇప్పటివరకు ఏ అధికారులు కూడా రాకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రభు త్వానికి చెడ్డపేరు వస్తుందని కలమట అన్నారు. తక్షణం ఎస్పీతో పాటు కలెక్టర్‌కు ఫోన్ చేసి ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపుపై ఫిర్యాదు చేశారు. గత 3 రోజులుగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. దీనిపై ముఖ్యమంత్రికి పిర్యాదు చేస్తానన్నారు. అయితే ఇసుక తరలింపు వెనుక కొందరు అధికార పార్టీకి చెందిన నేతలు ఉన్నారని పలువురు చెబుతున్నారు. ఎమ్మెల్యే అనుచరులు దగ్గరుండి ఇసుక దందా నడిపిస్తున్నారని వార్త గుప్పుమంటోంది. కలమట, ఎంజీఆర్ మధ్య పొలిటికల్ లొల్లి ఉంది. దీంతోనే కలమట అనుచరులే ఎంజీఆర్ అనుచరులు ఈ ఇసుకను తరలిస్తున్నారంటూ బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.



## సీపీఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం

**మందస, ఆగస్టు 31 (వార్త):** సీపీఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఏపీటీఎఫ్ నాయకులు అన్నారు. ఆదివారం సిపిఎస్ విధానం ఆంధ్రప్రదేశ్లో ప్రవేశపెట్టబడి, 20 సంవత్సరాలైన నేపథ్యంలో పాత తాలూకా కేంద్రాలలో నిరసన కార్యక్రమం చేయాలని ఏపీటీఎఫ్ పిలుపునిచ్చింది. ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానం తప్పిస్తే మరేది తమకు ఆమోదయోగ్యం కాదనే విధానానికి ఏపీటీఎఫ్ కట్టుబడి ఉందన్నారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు సోంపేట, కంచిలి, మందస మండలాలకు చెందిన సిపిఎస్ ఉద్యోగులు, సీపీఎస్ను వ్యతిరేకించే ఇతర ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, మందస మండల శాఖ అధ్యక్షుడు ఎస్.కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె.సుందర రావు పిలుపునిచ్చారు.

## నేడు శ్రీరామానంద యోగాశ్రమంలో సత్సంగం

**మందస, ఆగస్టు 31 (వార్త):** మందస మండలం లోని పిడిమందస, వీరగున్నమ్మపురం, కుంటికోట పరిధిలో గల భల్లూకగిరిపై ఉన్న శ్రీరామానంద యోగాశ్రమంలో ఆదివారం గాయత్రీ హెూమము, సత్సంగము, భజన కార్యక్రమము జరుగుతుందని ఆశ్రమ కమిటీ ప్రతినిధులు చెప్పారు. అఖిలాంధ్ర సాధు పరిషత్ సభ్యులు, గౌరవ పీఠాధిపతులు ముఖ్య అతిధులుగా పాల్గొంటారని, ఆశ్రమ శ్రేయోభిలాషులు, భక్తులు, చుట్టు ప్రక్కల గ్రామాలలో పెద్దలు కార్యక్రమమునకు జయప్రదం చేయాలని వారు కోరారు.

## విద్యార్థులకు పలకల పంపిణీ

**నరసన్నపేట, ఆగస్టు 31 (వార్త):** బొరిగివలస ప్రాథమిక పాఠశాలలో శనివారం సూరప్ప భీమారావు విద్యార్థులకు ఉచితంగా పలకలు పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని భీమా రావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వృద్ధుడు మృతి

**నరసన్నపేట, ఆగస్టు 31 (వార్త):** నరసన్నపేట మండలంలోని స్థానిక జాతీయ రహదారిపై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడని ఎస్ఐ దుర్గా ప్రసాద్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి గస్తీ నిర్వహిస్తున్న సందర్భంగా వృద్ధుడు రోడ్డుపై పడి ఉండడాన్ని గమనించామన్నారు. ఆయనను లేపేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడని తెలిపారు.

## అందుబాటులోకి డిజిటల్ విద్యుత్ మీటర్లు

**నరసన్నపేట, ఆగస్టు 31 (వార్త):** రాష్ట్ర విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల డిజిటల్ విద్యుత్ మీటర్లు అందుబాటులోకి తీసుకొస్తుందని, త్వరలో నరసన్నపేట మండల కేంద్రంలో వీటిని ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. ఈ క్రమంలో మొదటిసారిగా 10 విద్యుత్ మీటర్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

## పింఛన్ల పంపిణీలో మందసకు మొదటిస్థానం



**మందస, ఆగస్టు 31 (వార్త):** ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జిల్లాలోనే మందసకు మొదటి స్థానం లభించింది. మందస మండలానికి సంబంధించి 11581 పెన్సనర్లకు రూ.4.77 కోట్లు విడుదలయ్యాయి. 93.14 శాతంతో మందస ముందుండగా, 93.03తో పోలాకి, 63.02తో పలాస మండలాలు ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి. ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు పింఛన్ల పంపిణీ పర్యవేక్షించారు. పిడిమందసలో ఏపీఎం గొడబ ప్రసాదరావు పింఛన్లు పంపిణీ చేశారు. పలు చోట్లు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు పింఛన్లను అందజేశారు.

## సామాజిక పింఛన్ల పంపిణీ

**నరసన్నపేట/పోలాకి, ఆగస్టు 31 (వార్త):** నరసన్నపేట మండలం కిల్లాం గ్రామంలో పింఛనుదారులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, తహశీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ ఆర్‌బీ రామన్న, ఉప సర్పంచ్ పి.సత్యనారాయణతో కలిసి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే పోలాకి మండలం కుసుమ పోలవలస పంచాయతీలోనూ ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు.

# జీడిపప్పు అక్రమ రవాణా

* కోసంగిపురం జంక్షన్ కేంద్రంగా..
* ప్రైవేట్ వాహనాల్లో పప్పు తరలింపు..
* పన్ను ఎగవేతకు కొత్త పద్ధతి
* అధికారులకు నెలవారీ మామూళ్లు
* కన్నెత్తి చూడనం సంబంధిత అధికారులు





**పలాస, ఆగస్టు 31(వార్త):** జీడిపప్పు అంటే పలాస.. పలాస అంటేనే జీడి పప్పు అనే పేరు ఉంది. పలాస కేంద్రంగా సుమారు 350 వరకు జీడి పరిశ్రమలు ఉన్నాయి. ఏటా కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి జీడి పరిశ్రమలు ద్వారా ఆదాయం వస్తుంది. అయితే కొందరు జీడి వ్యాపారులు అడ్డదారిలో పప్పును తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. కాశీబుగ్గకు దగ్గరలో ఉన్న కోసంగిపురం జంక్షన్ కేంద్రంగా జీడిపప్పు అక్రమ ఎగుమతులు జరుగుతున్నాయి. కొందరు వ్యాపారులు కాశీబుగ్గలోని జీడిపరిశ్రమల నుంచి పప్పును వ్యాన్లు, ఆటోల ద్వారా కోసంగిపురం జంక్షన్‌కు తీసుకువెళుతున్నారు. అక్కడి నుంచి ప్రైవేటు వాహనాల ద్వారా జీడిపప్పు విశాఖ పట్నం విజయవాడ తదితరుల ప్రాంతాలకు ఎటువంటి రశీదులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారు. పలాస నుంచి వెళుతున్న ప్రైవేట్ ట్రావెలర్స్‌లో నిత్యం పెద్ద ఎత్తున జీడిపప్పు తరలిపోతోంది. దీనివల్ల రోజుకు లక్షలాదిరూపాయల ట్యాక్స్‌ను ప్రభుత్వానికి ఎగనామం పెడుతున్నారు. దీనిపై కొందరు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. అయితే సంబంధిత అధికారులకు నెలవారీ మామూళ్లను వ్యాపారులు కొందరు ఇస్తుండడంతో వారు ఈ తతంగంపై కన్నెత్తి చూడడం లేదు. పత్రికల్లో కథనాలు వచ్చిన వెంటనే రెండు మూడు రోజులు దాడులు చేసి ఆ తర్వాత సైలెంట్ అవుతున్నారు. ఈ అక్రమ తరలింపుపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే నిజాలు బయటపడతాయి.


Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413